క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని వజ్రపుకొత్తూరులో ఉన్న బాలికల జూనియర్ కళాశాలలో చదువుకున్న నువ్వలరేవు గ్రామానికి చెందిన బాలికలు బెహరా దీపిక, ఎం.అశ్విని, బి.లక్ష్మిలు అత్యధిక మార్కులతో సత్తాచాటారు. దీంతో కళాశాలలో ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా, తోటి అధ్యాపక సిబ్బంది విద్యార్థులను బుధవారం అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నీలవేణి

ఇచ్ఛాపురం రూరల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి అన్నారు. మండలంలోని మండపల్లి సెక్టారులో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. మొత్తం 15 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట శశిరేఖ, పిట్ట మామయ్య రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ



ల్యాప్‌టాప్‌ను హెచ్‌ఎం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పి.అరుణకుమారి బుధవారం ఒక టీవీ, రెండు ల్యాప్‌టాప్‌లను అదే పాఠశాలకు వితరణగా అందించారు. ఉత్తరాంధ్ర యూనిట్‌గా సమగ్ర శిక్ష, అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీరు వారు నిర్వహించిన పోటీల్లో ఆమె ఒక టీవీ, రెండు ల్యాప్‌టాప్‌లను పొందారు. దీంతో వీటిని విద్యార్థుల ఉపయోగార్థం హెచ్‌ఎం డి.గోవిందరావుకు అందించారు. వీటి సహాయంతో గ్రామీణ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలని ఆకాంక్షంచారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

మందస: మండలంలోని సవర రాజపురం, డలసరి, బుడంబో, బోందికారి అంగన్‌వాడీ కేంద్రాలను స్త్రీ, శిశు సంక్షేమ అధికారి బి.శాంతిశ్రీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఎదుగుదలపై పలు సూచనలు చేశారు. మందస ప్రాజెక్టు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఇచ్ఛాపురం రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సర్పంచ్ నీలాపు సారధిరెడ్డి అన్నారు. మండలంలోని కేదారిపురం గ్రామంలో బుధవారం అయ్యప్ప ఆరాధన పీఠం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వామి హేమంత్ రౌలో తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: గ్రామ పంచాయతీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పాలకవర్గం సముచిత ప్రాధాన్యం కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని గొర్లెపాడు పంచాయతీలో గ్రామ పంచాయతీ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.6 లక్షల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ కరగాన వసంత తెలియజేశారు. కార్యక్రమంలో కడియాల ప్రకాష్, కరగాన వల్లభరావు, మామిడి తులసయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జలయాత్ర

కంచిలి: ఇచ్ఛాపురం రూరల్ మండలం తులసిగాం గ్రామంలో బుధవారం గ్రామస్తులు వైభవంగా జలయాత్ర చేశారు. వైదేహి, కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయాల ప్రతిష్ట సందర్భంగా గ్రామస్తులు బాహుదా నదిలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడ నుంచి కలశాల్లో గంగా జలాన్ని నింపి జలయాత్ర చేపట్టారు. దీనిలో భాగంగా ఈనెల 18వ తేదీ వరకు హరేరామ హరేకృష్ణ నామ సంకీర్తన, నామయజ్ఞం, గృహయజ్ఞం చేపట్టనున్నట్లు తెలియజేశారు.

వామ్మో.. వానరాలు..!

- గ్రామాల్లో కోతుల బెడద
- ప్రజలపై దాడులు చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు





మఠం కంచిలిలో మెయిన్‌రోడ్డు మీద సంచరిస్తున్న కోతులు

కంచిలి:

అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్నటువంటి కంచిలి మండలంలో కోతుల బెడద క్రమేపీ పెరుగుతోంది. కొన్ని గ్రామాల్లో వానరాలు తిష్టవేసి నానా అల్లరి చేస్తున్నాయి. ఆదమరిచి ఇంటి తలుపులు తీసి విడిచిపెట్టినట్లయితే ఇళ్లలోకి ప్రవేశించి, ఇంట్లో ఉన్నవారిని బెదరగొట్టి దాడులకు పాల్పడుతున్నాయి. మహిళలు, చిన్న పిల్లలపై ఎప్పటికప్పుడు దాడిచేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నాయి. మండల కేంద్రం కంచిలితో పాటు డోలగోవిందపురం, భైరిపురం, ఘాటీ ముకుందాపురం, పోలేరు తదితర గ్రామాల్లో వీటి బెడద తీవ్రమయ్యింది. చాలా కాలంగా ఇక్కడ ఈ సమస్య ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని దశాబ్దాల కాలంగా ఈ మూడు గ్రామాల్లో కోతులమూకలు చేరి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

పంట పొలాలు అస్తవ్యస్తం

కోతుల సమస్యతో చాలామంది బంధువులు గ్రామాలకు రావడానికి ఇష్టపడని పరిస్థితి నెలకొంది. కొన్ని రకాల పంటలను కూడా సాగు చేయడానికి వెనుకాడాల్సి వస్తోంది. వరి సాగుచేసే సీజన్‌లో కొండలు పక్కన ఉండే ఈ గ్రామాల్లో పంట పొలాల్లోకి చేరి చేనుని అస్తవ్యస్తం చేస్తున్నాయి. వీటి సమస్యతో మిగతా పంటలను కూడా సాగు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ గ్రామాల్లో అందరూ కలిపి సుమారు 3వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అయితే దాదాపు వెయ్యికి పైగా కోతులు సమీపంలో ఉన్న కొండల నుంచి గ్రామాల్లో చేరి స్థానికులు ఏ పనులు చేయకుండా సమస్యలు సృష్టిస్తున్నాయి. ఇళ్లల్లో చేరి తినుబండారాలను, చేసిన వంటలను పాత్రలతో సహా తీసుకొని పారిపోయి, ఖాళీ చేసిన పాత్రలను ఎక్కడో ఒక చోట విడిచిపెడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. చివరికి దుస్తులు ఇంటిబయట ఆరబెట్టినా వాటిని కూడా తీసుకుపోవడం, చించివేయడం వంటి చేష్టలకు పాల్పడి విసుగు తెప్పిస్తుంటాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి తమ గ్రామం నుంచి కోతులమూకలను తరిమేయాలని కోరుతున్నారు.

ఏళ్లుగా తిష్టవేశాయి

కోతుల మూకలు చాలా ఏళ్లుగా ఇక్కడ తిష్టవేసి నానా అల్లరి చేస్తున్నాయి. ఇంటి బయట, లోపల ఉన్నవారిని సైతం భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఇంటి బయట దుస్తులు ఆరబెట్టినా పాడుచేస్తున్నాయి. మహిళలు, చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయి. వీటిని అటవీశాఖ వారు పట్టుకొని అడవుల్లో విడిచిపెట్టాలి.

– లద్దుకేశవపాత్రో, డోలగోవిందపురం, కంచిలి మండలం

కేబుల్ వైర్లు పాడు చేస్తున్నాయి

కోతులన్నీ మందలుగా వచ్చి ఎప్పటికప్పుడు కేబుల్ టీవీ ప్రసారాలు చేసే వైర్లను పాడుచేస్తున్నాయి. దీనివలన ఏటా చాలా వరకు నష్టపోవాల్సి వస్తోంది. అంతేకాకుండా ఫైబర్‌నెట్ యంత్రాలు కూడా పాడుచేస్తున్నాయి. దీని వలన నష్టం ఏర్పడడంతోపాటు ప్రసారాలు నిలిచిపోతుండడంతో వినియోగదారుల నుంచి తిట్లు తినాల్సి వస్తోంది.

– టి.సోమేశ్వరరావు, కేబుల్ ఆపరేటర్, కంచిలి



డోలగోవిందపురంలో కోతుల దాడిలో గాయపడిన బాలిక





భైరిపురం గ్రామంలో కోతుల సంచారం



మఠం కంచిలిలో ఇళ్ల మీద తిరుగుతున్న కోతులు

ఉపాధ్యాయులతో గౌరవంగా మెలగాలి



విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: విద్యార్థులు ఉపాధ్యాయులపై గౌరవం, క్రమశిక్షణతో మెలగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సూచించారు. స్థానిక బెల్లుపడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పాఠశాల హెచ్‌ఎం నీలాచలం అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతరం వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు, పిలక దీప, పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల రజతోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఎంఈవో ధనంజయ మజ్జి

కవిటి: మండలంలోని బొన్నపుట్టుగ ప్రాథమిక పాఠశాల రజతోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ధనంజయ మజ్జి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలు రజతోత్సవ సంబరాలు జరుపుకోవడం శుభపరిణామమన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విద్యార్థులను చేర్పించడం ద్వారానే ఈ స్థాయి ఘనత సాధించగలుగుతున్నామని విశ్రాంత ఎంఈవో పూడి బాలయ్య, వైస్ ఎంపీపీ పూడి నేతాజీలు పేర్కొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. కార్యక్రమంలో బి.సీతారామ్మూర్తి, జోగయ్య, వేదవ్యాస్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు నిల్వ ఉంటే చర్యలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ నడిపిన రామారావు బుధవారం పర్యటించి శానిటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు, వ్యాపార కూడళ్ల ముందు కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ బడులు బలోపేతం చేయాలి



యూటీఎఫ్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల యూటీఎఫ్ ముఖ్య నేతలతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లోనే మానవతా విలువలు సజీవంగా ఉంటాయన్నారు. అనంతరం యూటీ ఎఫ్ ముద్రించిన ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవిటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్, సీతంనాయుడు, సోంపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుర్మారావు దొరబాబు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో చేర్పించాలి

కంచిలి: చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి–1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. మండలంలోని కత్తివరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మాధవి బెహరా ఆధ్వర్యంలో గ్రామంలో ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటి టి.ఢిల్లీరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మౌలిక సదుపాయాలు ఉన్నటువంటి సర్కారు బడుల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారులు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథంలు కోరారు. 2025–26 విద్యా సంవత్సరం న్యూ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం బొడ్డబడ, కొళిగాం, కీర్తిపురం, పాయితారి, సైదాలపుట్టుగ, బి.తోటూరు, బిర్లంగి, ఇన్నేశుపేట, పూర్ణాటకం, బలరాంపురం గ్రామాల్లో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులతో కలిసి అంగన్‌వాడీ, చిన్నారుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



ఇచ్ఛాపురం రూరల్: కీర్తిపురంలో అవగాహన కల్పిస్తున్న ఎంఈవో అప్పారావు తదితరులు



కంచిలి: చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేసుల రాజీకి సహకరించాలి

టెక్కలి: స్థానిక కోర్టుల సముదాయంలో మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు, పోలీసు సిబ్బంది సహకరించాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల సూచించారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి పోలీసుస్టేషన్ల పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను పరిష్కరించేవిధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, డి.వి.వివేకానంద, ఎస్.ఎస్.రాజు, పి.బాబురావు, పి.చంద్రుడు, ఎస్.రమణారావు, డి.ధర్మారావు, ఎస్.రాజన్నాయుడు, చంద్రశేఖర్ పట్నాయక్, ఎ.వైకుంఠరావు, పి.సాయిరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు వినియోగించుకోండి



పెద్దతామరాపల్లిలో పరికరాలు తనిఖీ చేస్తున్న ఏడీఏ కృష్ణారావు

నందిగాం: రైతులు తమ వ్యవసాయ పనులను సులభంగా చేసుకోవడానికి కస్టమ్ హైరింగ్ సెంటర్లలోని వ్యవసాయ పరికరాలను వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.కృష్ణారావు సూచించారు. మండలంలోని పెద్దతామరాపల్లి, బెజ్జిపల్లి సచివాలయాల పరిధిలో ఉన్న రైతుసేవా కేంద్రాల కస్టమ్ హైరింగ్ కేంద్రాల్లో వ్యవసాయ పరికరాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 సచివాలయాల పరిధిలో 23 కస్టమ్ హైరింగ్ కేంద్రాలకు పరికరాలు అందజేశామన్నారు. పరికరాలను వినియోగించుకున్న రైతుల వివరాలు వీఏఏలు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ, వీఏఏ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతోనే సమాజంలో గుర్తింపు



రాజాను సన్మానిస్తున్న అక్కుపల్లి గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఒక వ్యక్తికి ప్రతిభతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని సినీ డాన్స్ కొరియోగ్రాఫర్ కుంది రాజా అన్నారు. అంతర్జాతీయ కళల దినోత్సవం సందర్భంగా అక్కుపల్లి శ్రీరామ సేవా సంఘం అధ్వర్యంలో మంగళవారం అతడిని సన్మానించారు. రాజా తన ప్రదర్శనలతో 600 అవార్డులు పొంది, ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. అలాగే గ్రామ భజన కళాకారులు టి.మహేశ్వరరావు, మద్దు నారాయణ, లక్ష్మి, కాస రాజాబాబు, పి.కూర్మారావు, లండ వైకుంఠరావులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోసా వరప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు, కోశాధికారి కాస చలపతి, సింగుపల్లి బాలకృష్ణ, బర్రి భూపతి, సూరాడ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతికి ప్రజాభిప్రాయ సేకరణ

నందిగాం: మండలంలోని గొల్లూరు పంచాయతీ సొంటినూరు సర్వే నంబరు–1లో ఉన్న కొండలో గ్రానైట్ నిర్వహణకు చేసుకున్న దరఖాస్తు ప్రాప్తికి ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. బుధవారం గొల్లూరులో పలాస ఆర్డీవో జి.వెంకటేష్, కాలుష్య నివారణ మండలి ఈఈ కరుణశ్రీ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అయితే సొంటినూరు పరిధిలో ఉన్న కొండపై ప్రజాభిప్రాయ సేకరణకు సమావేశాన్ని, ఆ గ్రామంలో కాకుండా వేరే గ్రామంలో పెట్టడంపై పలువురు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ విజయలక్ష్మి, తహసీల్దార్ సోమేశ్వరరావు, నాని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో నీడ



డొంకూరులోని పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన నీడ సౌకర్యం

ఇచ్ఛాపురం రూరల్: ఎట్టకేలకు ఉపాధి హామీ పని ప్రదేశంలో వేతనదారులకు నీడ సౌకర్యం కల్పించారు. ఎండల్లో ఉపాధి కూలీలు పడుతున్న బాధలను తెలియజేస్తూ 'వేతనదారులు విలవిల' శీర్షికతో ఈనెల 12వ తేదీన సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో తాటి, కొబ్బరి కమ్మలతో నీడను కల్పించినట్లు ఏపీవో పి.శ్రీనివాసరావు తెలిపారు.

స్టేజ్ పోడియం వితరణ

పలాస: మండలంలోని బొడ్డపాడు గ్రామ అగ్నికుల క్షత్రియ సంఘానికి అదే గ్రామానికి చెందిన గేదెల చిన్నారావు జ్ఞాపకార్థం అతని భార్య భానుమతి ఒక స్టేజ్ పోడియంను వితరణగా అందజేశారు. సంఘ భవనం వద్ద సభ్యుల సమక్షంలో చిన్నారావు కుమారుడు వేణు దీన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు పోతనపల్లి దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ విద్య

కవిటి: ప్రభుత్వ కళాశాలల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉత్తమ విద్య లభిస్తుందని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ మండలంలోని కొత్తపాలెం, జాలారిపాలెం, చిన్నకర్రివానిపాలెం తదితర గ్రామాల్లో బుధవారం అవగాహన కల్పించారు. కళాశాలలో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలియజేశారు.

గ్యాస్ వినియోగంపై అప్రమత్తత అవసరం

టెక్కలి: గ్యాస్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోటబొమ్మాళి అగ్నిమాపక శాఖాధికారి రుక్మాంధరరెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గ్యాస్, ఎలక్ట్రికల్ ప్రమాదాలపై బుధవారం కోటబొమ్మాళిలోని పలు కాలనీల్లో అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ల నుంచి మంటలు వ్యాపించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఖచ్చితంగా 101 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ కాలనీలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అవ్వడం వలన వచ్చే మంటలను ఎలా అదుపు చేయాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బందితో పాటు ప్రజలు పాల్గొన్నారు.

సోంపేట: గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని సోంపేట అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోంపేటలో మహిళలకు గ్యాస్ ప్రమాదాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని స్వేచ్ఛావతి అపార్ట్‌మెంట్‌లో మహిళలకు అగ్నిమాపకదళ సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్‌లో, ఇళ్లలో అగ్ని ప్రమాదాలకు గల కారణాలను, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకదళ సిబ్బంది కె.ప్రశాంత్, ఆర్.సూర్యారావు, ఎస్.నీలాచలం, టి.కామరాజు, ప్రసాద్, రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశీబుగ్గ పండా క్వార్టర్స్‌లో బుధవారం వంట గ్యాస్ వినియోగంపై అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారులు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: ప్రమాదాన్ని వివరిస్తున్న అధికారులు



ఇచ్ఛాపురం టౌన్: కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



సోంపేట: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు



టెక్కలి: కోటబొమ్మాళిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



టెక్కలి రూరల్: గ్యాస్ సిలిండర్లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ద్రవ జీవామృతం తయారీపై అవగాహన

కంచిలి: మండలంలోని బలియాపుట్టుగ గ్రామ రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ, రీజనల్ ట్రైనర్ ఆఫీసర్ హేమసుందర్ ఆధ్వర్యంలో ద్రవ జీవామృతం తయారు చేశారు. దీనివలన ఉపయోగాలను ట్రైనింగ్ ఎస్‌ఎఫ్‌ఏ గోవిందరెడ్డి వివరించారు. రైతులకు నవధాన్యాల ఉపయోగం, వాటి వలన కలిగే లాభాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ శివాజీ, ఎంటీ దుర్గాప్రసాద్, మెంటర్ లోహిదాస్, మండల యాంకర్ శివానందం, ఎల్‌టులు కామరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో మేలు

సోంపేట: నవధాన్యాల సాగుతో నేలకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. సోంపేట మండలంలోని పలాసపురం యూనిట్ పరిధిలో బుధవారం పీఎండీఎస్ కిట్స్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవధాన్యాలను తొలకరి వర్షాలకు ముందుగా పొలంలో వేసుకుని, 40 రోజుల తర్వాత భూమిని కలియదున్నితే పోషకాలు అందుతాయన్నారు. ప్రపంచం చూపు.. ప్రకృతి సాగువైపు అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ హేమసుందర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.